
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024



సదస్సుకు మూడు జిల్లాల కలెక్టర్లు దూరం

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే కలెక్టర్ల సదస్సుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు హాజరు కావడంలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అనుమతి కోసం విశాఖ కలెక్టర్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. అయితే సదస్సులో జిల్లాల వారీగా అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్తు కార్యాచరణపై వివరించాల్సి ఉంటుంది. ఆయా అంశాలు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఈసీ అనుమతి ఇవ్వలేదని సమాచారం.

రైల్వే స్టేషన్‌లో భయం... భయం

ఆగి ఉన్న కోర్బా రైలు ఏసీ కోచ్‌లలో అగ్నిప్రమాదం

ఉవ్వెత్తున ఎగసిపడిన మంటలు

దట్టంగా వ్యాపించిన పొగ

బెంబేలెత్తిన ప్రయాణికులు


నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై కోర్బా రైలు ప్రమాద దృశ్యం


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

- ప్రాణభయంతో స్టేషన్ బయటకు పరుగులు
- మంటలు అదుపుచేసేందుకు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఆర్ఎం, సీపీ బాగ్చీ

ఎటు చూసినా జనం... తాము ఎక్కాల్సిన రైళ్ల కోసం కొందరు... దిగి ఇంటికి చేరుకునే ఆత్రుతలో మరికొందరు.. ఇలా ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో సందడి వాతావరణం నెలకొంది. సరిగ్గా సమయం ఉదయం 9.20 గంటలు.. ఒక్కసారిగా దట్టమైన పొగ స్టేషన్‌ను కమ్మేసింది. అంతలోనే ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. అందరిలోనూ ఆందోళన... ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి. అంతే ప్రయాణికులంతా ప్రాణభయంతో స్టేషన్ బయటకు పరుగులు తీశారు. నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ కాలిపోతోందనే వార్తతో సర్వత్రా భయాందోళన నెలకొంది. అప్రమత్తమైన యంత్రాంగం మంటలను అదుపుచేసే చర్యలు చేపట్టినా... ప్రయాణికుల్లో ఆందోళన మాత్రం తగ్గలేదు.


కోచ్‌లో దట్టంగా వ్యాపించిన పొగ

కోర్బా రైల్లో మంటలు - వివరాలు మెయిన్ 12లో

విశాఖపట్నం, ఆగస్టు 4: విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కోచ్‌ల నుంచి ఎగిసిన మంటలు, దట్టమైన పొగ భయభ్రాంతులకు గురిచేసింది. రైళ్ల కోసం ప్లాట్‌ఫామ్‌లపై నిరీక్షించిన ప్రయాణికులను బెంబేలెత్తించడమే కాకుండా ప్రాణ భయాన్ని కలిగించింది. స్టేషన్‌ను కమ్మేసిన పొగ, చెలరేగిన మంటలను చూసిన కొందరు పెద్దగా కేకలు వేయడంతో వివిధ ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న ప్రయాణికులు స్టేషన్ బయటకు పరుగు తీశారు. ఏం జరుగుతుందో తెలియక రైల్వే సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. నాల్గో నంబరు ప్లాట్‌ఫామ్‌పై వ్యాపారం నిర్వహించే సిబ్బంది స్టాల్స్‌ను వదిలిపెట్టి పరుగందుకున్నారు.

గందరగోళంగా రైల్వే స్టేషన్

అగ్ని ప్రమాదం సంభవించిన నాల్గో నంబరు ప్లాట్‌ఫామ్‌కు రైల్వే సిబ్బంది,

... మిగతా 6వ పేజీలో


స్మోక్ సెన్సార్

స్మోక్ సెన్సార్లు పనిచేస్తున్నాయా?

- షార్ట్ సర్క్యూటే కారణమా?
- ప్రమాదంపై అనేక అనుమానాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోర్బా ఎక్స్‌ప్రెస్ నుంచి విడదీసి నాలుగో నంబరు ప్లాట్‌ఫామ్‌పై పెట్టిన కోచ్‌లలో దట్టమైన పొగలు వచ్చాక, మంటలు కూడా వ్యాపించాకే అంతా అప్రమత్తమయ్యారు. మొదట బీ-7 కోచ్ నుంచే పొగ, మంటలు వచ్చాయి. ఆ తరువాత అవి బీ-5, బీ-6 కోచ్‌లకు

... మిగతా 6వ పేజీలో

4వ నంబరు ప్లాట్‌ఫారానికి ఏమైంది?

- నాలుగు నెలల క్రితం కుంగిన ఆర్ఓబీ
- ఇప్పుడు అక్కడే ఏసీ బోగీల దగ్ధం


పూర్తిగా కాలిపోయిన బీ-7 కోచ్

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వేస్టేషన్ రాష్ట్రంలో అత్యంత ప్రధానమైనది. విజయవాడ తరువాత ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్. ఇక్కడ నాలుగు నెలల కాలంలో రెండు భారీ ప్రమాదాలు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్ ఎనిమిదో తేదీన ముఖద్వారం వైపు దక్షిణాన ఉన్న రైల్ ఓవర్ బ్రిడ్జి మూడు - నాలుగు నంబర్ ప్లాట్‌ఫారాల మధ్య ఆకస్మికంగా కుంగిపోయింది. సాధారణంగా ఇలాంటి రైల్వే స్టేషన్లలో రెగ్యులర్ నిర్వహణ పనులు జరుగుతుంటాయి. ఆర్ఓబీలకు ఏదైనా సమస్య ఉంటే గుర్తించి ముందే మరమ్మతులు చేస్తారు. కానీ ఇక్కడ కుంగిపోయిన తరువాత గానీ అధికారులు గుర్తించలేకపోయారు. క్రేన్ల సాయంతో యుద్ధ ప్రాతిపదికన క్రేన్ల పనులు చేపట్టి నెల రోజుల తరువాత పునరుద్ధరించారు. ఇప్పుడు అదే నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపై కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఏసీ కోచ్‌లలో అగ్నిప్రమాదం సంభవించింది. నడుస్తున్న రైళ్లలో ప్రమాదాలు సంభవిస్తుంటాయి. కానీ ఆగిఉన్న, విద్యుత్ సరఫరా లేని కోచ్‌లో ప్రమాదం జరగడంపై అనుమానాలు కలుగుతున్నాయి. లాక్ చేసిన కోచ్‌లోకి ఎవరూ వెళ్లే అవకాశం లేదు. ఏసీ కోచ్ కావడంతో లోపలికి సిగరెట్, అగ్గిపుల్ల లాంటివి వేసే అవకాశం లేదు. మరి పొగ ఎలా వచ్చింది? మంటలు ఎలా వ్యాపించాయనే దానిపై అనుమానాలున్నాయి. కేవలం నాలుగు నెలల కాలంలో రెండు మేజర్ ప్రమాదాలు జరగడంతో విశాఖ స్టేషన్‌లో భద్రతాపరమైన చర్యలు మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది. నిర్వహణ పనులు తూతూ మంత్రంగా చేయడం, తనిఖీలు సక్రమంగా జరగకపోవడం వల్లే ఈ ఘటనలు జరిగాయని భావిస్తున్నారు.


సంఘటనా స్థలంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ఎయిడెడ్ ఫ్యాకల్టీపై చర్యలకు మీనమేషాలు

- అడ్డదారుల్లో ఏయూకు వచ్చారని ఫిర్యాదులు
- పాలిటిక్స్, అడ్మినిస్ట్రేషన్ హెచ్‌వోడీ తొలగింపు



- మరో నాలుగు విభాగాల్లో ఇప్పటికీ కొనసాగింపు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న ఎయిడెడ్ ఉద్యోగుల తొలగింపులో ఉన్నతాధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నార న్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఎయిడెడ్ కాలేజీలకు చెందిన సుమారు వంద మంది అధ్యాపకులను గత వీసీ వర్సిటీలోకి తీసుకున్నారు. వీరిపై ఉద్యోగులు ఫిర్యాదులు చేయడం, కోర్టును ఆశ్రయించడంతో 60 మందికిపైగా ప్రభుత్వ కళాశాలలకు వెళ్లిపోయారు. కానీ 40 మంది ఇప్పటికీ వర్సిటీలో కొనసాగుతున్నారు. వీరిని తీసుకోవడమే నిబంధనలకు విరుద్ధమన్న ఆందోళనలుండగా, గత పాలకులు వీరికి ఉన్నత పదవులను కట్టబెట్టారు. చాలా మందికి హెచ్‌వోడీలుగా, డీన్లుగా అవకాశం కల్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ జి.శశిభూషణరావు బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, ఉద్యోగులు ఎయిడెడ్ ఫ్యాకల్టీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి వీసీ పాలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీగా పనిచేస్తున్న ఎయిడెడ్ ఫ్యాకల్టీని తొలగించి అదే విభాగంలోని సీనియర్ ప్రొఫెసర్‌కు అప్పగించారు. దీంతో మిగిలిన వారిపైనా చర్యలుంటాయని భావించారు. కానీ వారం రోజులుదాటినా ఎలాంటి చర్యలులేవు. ప్రస్తుతం

... మిగతా 6వ పేజీలో

పోటీకి టీడీపీ సై

అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్

- ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీకి గండి బాబ్జీ, పీలా గోవింద్, పీవీజీ కుమార్ యత్నాలు
- నేడు నగరంలో భేటీ కానున్న ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు


గండి బాబ్జీ




పీలా గోవింద్


పీవీజీ కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అభ్యర్థి ఎంపికపై నేతలు కసరత్తు ప్రారంభించారు. శనివారం అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్ ఇంట్లో గ్రామీణ ప్రాంత నేతలు సమావేశమయ్యారు. ఎన్నికలకు పార్టీ తరఫున ఓటర్ల వివరాలపై చర్చించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి పార్టీ తరఫున పోటీ చేసేందుకు విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి అవకాశం ఇవ్వాలని కోరారు. తాజాగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇంకా మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాగా బీజేపీ నుంచి గ్రామాధికారుల సంఘం మాజీ నేత ఈర్లె శ్రీరామమూర్తి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఈ నెల ఆరో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నందున అభ్యర్థిని త్వరగా ఎంపికచేయాలని అధిష్ఠానం సూచించింది. ఇప్పటికే వైసీపీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ప్రకటించడంతో టీడీపీ తరఫున అభ్యర్థి ఎంపికకు సోమవారం రాత్రి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇంట్లో ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు, విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు అధ్యక్షులు భేటీ కానున్నారని సమాచారం. అయితే కలెక్టర్ల సదస్సుకు హాజరవుతున్నందున హోంమంత్రి అనిత హాజరుకావడం లేదని తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ రేపు

- రిటర్నింగ్ అధికారిగా జేసీ మయూర్ అశోక్
- సహాయ రిటర్నింగ్ అధికారులుగా డీఆర్‌వోలు
- మొత్తం ఓటర్లు 838 మంది

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు ఈ నెల ఆరో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న నామినేషన్ల పరిశీలన, 16న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. కాగా ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తారు. ఈ ఎన్నికల్లో మొత్తం 838 మంది ఓటర్లున్నారని అధికారులు తాజాగా లెక్కించారు.

ఓటర్లు వీరే...

ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మంది జడ్పీటీసీ సభ్యుల్లో 36 మంది (ఇద్దరు మృతిచెందగా,

... మిగతా 6వ పేజీలో

నగరంలో రామ్ సందడి



నగరంలో ఆదివారం డబుల్ ఇస్మార్ట్ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో హీరో రామ్ పోతినేని, హీరోయిన్ కావ్య థాపర్ నృత్యాలతో సందడి చేశారు.

- 6వ పేజీలో

గంభీరం రిజర్వాయర్‌లో పడి విద్యార్థి మృతి

- స్నేహితుల దినోత్సవం రోజున సంఘటన

ఆనందపురం, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం రోజున విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు గంభీరం రిజర్వాయర్ వద్దకు వెళ్లిన ముగ్గురు మిత్రుల్లో ఒకరు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన డోకి నిరంజన్ (20), విశాఖకు చెందిన జె.యశ్వంత్, బి.ఆశిష్, హైదరాబాద్‌కు చెందిన రెహన్, తాడేపల్లిగూడేనికి చెందిన లలిత్ విశాఖలోని గీతం కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. స్నేహితుల దినోత్సవం కావడంతో సరదాగా గడిపేందుకు ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో గంభీరం రిజర్వాయర్‌కు చేరుకున్నారు. సరదాగా గడుపుతుండగా డోకి నిరంజన్ సెల్ఫీ తీయడానికి ప్రయత్నించి ఒక్కసారిగా కాలుజారి రిజర్వాయర్‌లో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు జె.యశ్వంత్, బి.ఆశిష్ నీటిలో దూకారు. అయితే ముగ్గురికీ సరిగా ఈత రాకపోవడంతో నీట మునిగిపోతుండగా, స్థానికులు గమనించి రిజర్వాయర్‌లోకి దూకి కాపాడే ప్రయత్నం చేశారు. అయితే యశ్వంత్, ఆశిష్‌లను సురక్షితంగా బయటకు తీసినా, నిరంజన్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బలగాల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి, మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆస్పత్రికి తరలించి సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషాదం మిగిల్చిన విహారం



నిరంజన్ మృతదేహం వద్ద విలపిస్తున్న స్నేహితులు, నిరంజన్ (ఫైల్ ఫొటో)

బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు తోడ్పాటు



మాట్లాడుతున్న రామకోటయ్య

సీతమ్మధార, ఆగస్టు 4: బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు సహకారం అందజేయడమే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మిణ్ పని చేస్తోందని సంస్థ గౌరవాధ్యక్షుడు చెరువు రామకోటయ్య తెలిపారు. ఆదివారం శంకరమఠంలో బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిజాయితీ, నిబద్ధతతో వ్యాపారం చేసి అందరి మన్ననలు పొందాలని బ్రాహ్మణ యువతకు సూచించారు. వ్యాపారం ప్రారంభించాలనే బ్రాహ్మణ ఔత్సాహికులకు తాము అన్ని విధాలా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. వ్యాపార అభివృద్ధి, అవసరమైన మౌలిక వసతులు, ఆర్థిక వనరులు తదితర అంశాల్లో సభ్యులకు సమగ్ర అవగాహన కల్పించి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ ధవల మధుసూదనరావు, సెక్రటరీ పరిమి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు



మనుమడికు పైడమ్మను అప్పగిస్తున్న వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి

అక్కయ్యపాలెం, ఆగస్టు 4: తప్పిపోయిన ఓ వృద్ధురాలిని తిరిగి ఆమె ఇంటికి అసోసియేషన్ ఆఫ్ అర్బన్, ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఏయూటీడీ) చేర్చింది. పైడమ్మ (66) వృద్ధురాలు రెండు రోజుల క్రితం తన పెద్ద కుమార్తెతో కలిసి విజయనగరం వెళ్లేందుకు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వచ్చారు. ఇంతలో ఆమె కుమార్తెను వీడి కాంప్లెక్స్‌లో తప్పిపోయినట్టు టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. శనివారం రాత్రి వృద్ధురాలిని గుర్తించిన రెండో పట్టణ పోలీసులు ఆరా తీయగా వివరాలు చెప్పలేకపోయింది. దీంతో టీఎస్సార్ కాంప్లెక్సులో ఉన్న ఏయూటీడీ, జీవీఎంసీ మహిళా షెల్టర్‌కు పోలీసులు తరలించారు. అయితే, ఆమె వద్దనున్న పెన్షన్ స్లిప్ ఆధారంగా మద్దిలపాలెం సహా వివిధ సచివాలయాలకు సమాచారమందించారు. పెన్షన్ ఐడీకి లింకై ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా, పైడమ్మ మనుమడు గౌరినాయుడు మద్దిలపాలెం నుంచి వచ్చి వృద్ధురాలిని తీసుకుని వెళ్లారు. ఏయూటీడీ సేవలను, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయికి ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు పత్రం అందిస్తున్న నాగరాజు

జ్ఞానాపురం, ఆగస్టు 4: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విశాఖ దక్షిణ నియోజకవర్గ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భీమ్‌నగర్, పూతివారి వీధి, సౌత్ జైల్‌రోడ్డు ప్రాంతంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు కూడా సభ్యత్వ నమోదు చేయించుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో కంచి మూర్తి ఈశ్వరరావు, మద్ది రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, రాజు, అప్పలరాజు, నాయకులు కందుల బద్రీనాథ్, కందుల కేదార్‌నాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్యులు, మహిళా సంఘం ప్రతినిధులు

కంచరపాలెం, ఆగస్టు 4 : జీవీఎంసీ 55వార్డు పరిధి ధర్మానగర్, కంచరపాలెం ఏరియాలో శ్రీ దుర్గామహిళా చైతన్య సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్ఆర్ ఆసుపత్రి అధినేత సత్యానంద్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు కె.వి. కృష్ణారావు, బాలశంకర్, మధుబాబు తదితరులు పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 200మంది రోగులకు చికిత్సనందించారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం వ్యవస్థాపకుడు పి.ఆదినారాయణ, మహిళా అధ్యక్షురాలు బి.లత, పి. నాగలక్ష్మి, తిరుమలేష్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మండలాలు సరే.. సిబ్బంది ఏరీ?

- విశాఖపట్నం అర్బన్ విద్యాశాఖలో నాలుగు మండలాలు ఏర్పాటు
- ఒక్కో చోట ఇద్దరు చొప్పున ఎంఈవోలు, సీఆర్‌పీల నియామకం
- సిబ్బందిని నియమించని వైనం... కూర్చునేందుకు నీడ కరవు
- గత ప్రభుత్వ నిర్వాకంతో అవస్థలు



సీతమ్మధారంలో ఒకే చోట ఉన్న కార్యాలయం

కంచరపాలెం, ఆగస్టు 4: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం అర్బన్ పరిధి విద్యాశాఖలో నాలుగు మండలాలు ఏర్పాటయ్యాయి. ప్రతి మండలానికి ఇద్దరుచొప్పున మండలవిద్యాశాఖాధికారులను నియమించారు. మండలాలైతే ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఎంఈవో కార్యాలయాల్లో సిబ్బందిని మాత్రం నియమించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్తగా ఎంఈవోలుగా వచ్చిన వారు కూర్చోవడానికి నిలువ నీడ కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఆయా మండలాల్లో అనువైన పాఠశాలను వెతుక్కుంటూ అక్కడే తాత్కాలికంగా తమ కార్యాలయాలుగా ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలను నెట్టుకొస్తున్నారు. విద్యాశాఖలో ప్రతి పని కంప్యూటర్ పైనే చేయాల్సి రావడం, వాటి నిర్వహణకు సిబ్బంది లేక ఎంఈవోలు తలపట్టుకుంటున్నారు. ప్రతి మండల కార్యాలయంలో ఎమ్మార్సీ (మండల వనరుల కేంద్రం)లో ఒక ఎంఐఎస్ కో ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అక్కౌంటెంట్, మెసెంజరు తదితర సిబ్బంది తప్పకుండా ఉండాలి. ఎంఈవోలు ప్రతి నెలా చూపే ఉపాధ్యాయుల జీతాలు బిల్లులు, విద్యా సంబంధిత డేటాను వీరు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే, సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్పీలపైనే ఈ పనిభారం పడుతోంది.

సీతమ్మధారలో ఒకే చోట సిబ్బంది

గతంలో విశాఖ అర్బన్ అంతా ఒకే మండలంగా ఉండేది. అప్పుడు ఇక్కడ పనిచేసే ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్, మెసెంజర్ తదితర సిబ్బంది ప్రస్తుతం సీతమ్మధార మండలానికే పరిమితమయ్యారు. మిగిలిన కొత్తగా ఏర్పాటైన మూడు మండల కార్యాలయాలు గోపాలపట్టణం, మహారాణిపేట, ములగాడలలో ఒక్క సిబ్బందినీ నియమించలేదు. ప్రస్తుతం ఈ మండలాల్లో ఇద్దరు చొప్పున ఎంఈవోలు, సీఆర్పీలు మాత్రమే ఉన్నారు. విద్యేతర పనులకు సిబ్బంది లేక, కొంత మంది ఎంఈవోలు తమ సొంత డబ్బుతో పనులు చేయిస్తున్నారు. కనీసం మెసెంజర్ లేకపోవడంతో కార్యాలయాలు ఊడ్చే గత్యంతరం లేకుండా పోతోంది. తలుపులను ఎంఈవోలే తీసి వేయాల్సిన దుస్థితి. ఎంఈవోలు నెలనెలా లక్ష్యం నిర్దేశిస్తారు., కానీ వసతులు సమకూర్చకుంటే ఎలా అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు దృష్టిని సారించి మండల విద్యాశాఖ కార్యాలయంలో అవసరమైన సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

విశాఖ సిటిజన్ ఫోరం సేవలు స్ఫూర్తిదాయకం

- పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు




సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు

డాబాగార్డెన్స్, ఆగస్టు 4: నగర ప్రజలకు విశాఖ సిటిజన్ ఫోరం చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. ఆదివారం రాత్రి సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం డాబాగార్డెన్స్ పాత జైల్ రోడ్డులోని సౌభాగ్య హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గణబాబు మాట్లాడుతూ, సిటిజన్ ఫోరం చేస్తున్న సేవలను భవిష్యత్తులో మరింతగా విస్తృతం చేయాలన్నారు. ప్రత్యేక అతిథి నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ నలుగురికి మంచి చేసే కార్యక్రమాలను చేపడుతుండడం గొప్ప విషయమని కొనియాడారు. విశాఖ సిటిజన్ ఫోరం గౌరవ అధ్యక్షులుగా పి.వెంకటరావు, అధ్యక్షుడిగా పి.ఎస్.తిలక్, ఉపాధ్యక్షులుగా కె.సత్యనారాయణ, సెక్రటరీలుగా పి.రామకృష్ణ, బి.సీతారామయ్య, కోశాధికారులుగా పీరాము, ఎస్.సోమునాయుడు, మరో నలుగురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఫోరం నాయకులు విద్యార్థి వెంకటరావు మాట్లాడుతూ తమ ఫోరం 13 ఏళ్ల నుంచి అనేక సేవా కార్య క్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబును సన్మానించారు.

క్లాక్ టవర్ గంటలు... సరికొత్త సవ్వడి

- జగదాంబ జంక్షన్ వద్ద మోగుతున్న గడియారం



సర్వాంగ సుందరంగా క్లాక్ టవర్

జగదాంబ కూడలి, ఆగస్టు 4: జగదాంబ కూడలిలో క్లాక్ టవర్ నుంచి గంటలు మోగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి క్లాక్ టవర్ ప్రతి గంటకూ గంటలు వినిపిస్తూ నగరవాసుల్లో సరికొత్త అనుభూతికి లోను చేసింది. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ క్లాక్ టవర్ నిర్మాణం చేపట్టారు. ఎంతో అందంగా నాలుగు ముఖాల్లో గడియారాలను ఏర్పాటు చేశారు. గడియారంలో సమయం కనిపించేది. రాత్రి వేళ రంగు రంగుల విద్యుత్ కాంతులతో ఆకర్షణగా నిలుస్తోంది. నిర్మాణ పనులు పూర్తి కావడంతో గడియారం ట్రైల్ రన్‌ను భువనేశ్వర్‌కు చెందిన తాజ్‌వాజ్ అండ్ ఎలక్ట్రానిక్స్ నిర్వహించింది. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో ఆదివారం నుంచి గంటల కొడుతూ ఆ శబ్దం సరికొత్త అనుభూతి నిస్తోంది. వంద అడుగుల ఎత్తులో క్లాక్ టవర్ ఏర్పాటు కాగా, ఇందులో డయల్ 8 అడుగుల విస్తీర్ణం నలువైపులా ఒకేలా ఉండేలా తీర్చిదిద్దారు. గడియారంలో పెద్దముళ్లు నాలుగు అడుగులు, చిన్న ముళ్లు మూడున్నర అడుగుల పొడవునా ఏర్పాటు చేశారు. గడియారం రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించేలా కాంతులతో టవర్ తీర్చిదిద్దారు. ఇప్పుడు ఠంచనుగా గంటలు మోగిస్తూ సమయం తెలుపుతోంది.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జ్ఞానాపురం, ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1987-88) ఆదివారం మేఘాలయ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రైల్వేకాలనీ, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఉత్తరాంధ్ర, తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి సుమారు వందమంది పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు. తమ పాఠశాలలో బాల్య స్మృతులు నెమరవేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి గతంలో చేపట్టిన కార్యక్రమాలు సమీక్షించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించారు. ఆటపాటలు, నృత్యాలతో హోరెత్తించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లక్కీడీప్‌కు అనూహ్య స్పందన వచ్చింది.



జ్ఞానాపురం హైస్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థులు

ఈ కార్యక్రమంలో బసవ శ్రీనివాస్, చామన విశ్వేశ్వరరావు, ఎం. రవీంద్ర, కె. గౌరీశంకర్, కె.ఈశ్వరి, ఎ.సంజీవి, ఎల్. కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



నక్కవానిపాలెంలో కేక్ కట్ చేస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం

సీతమ్మధార: నక్కవానిపాలెంలో బోర రవికుమార్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, ప్రజలు కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం విహార యాత్ర చేశారు. కోన గోవింద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోర ఆనంద్, బోర వేణురెడ్డి, బోర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రాస్ రూట్స్ ఫుట్‌బాల్ విజేత వెలంపేట ఎఫ్‌సీ



విజేతలకు ప్రశంసా పత్రాలందిస్తున్న అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఆగస్టు 4: జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జరిగిన గ్రాస్ రూట్స్ సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో వెలంపేట ఫుట్‌బాల్ క్లబ్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో అన్వర్ బాయ్స్‌పై విజయం సాధించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి పోలీసు అధికారి రవికుమార్, ఏపీఎఫ్ఏ గ్రాస్ రూట్స్ కన్వీనర్ సుస్మిత ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ఎస్‌జీ.రామకృష్ణ, ఎన్ఐఎస్ కోచ్ శేషమోహన్ (బుజ్జి), ఎస్‌కేఎంఎల్ గ్రాండ్ అధినేత పి.శ్రీనివాసరావు, త్రినాథ్ (బాబు), సన్నీ తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు ధూళిని నియంత్రించాలి'



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సీతమ్మధార, ఆగస్టు 4: విశాఖ పోర్టు అథారిటీలో బొగ్గు రవాణాతో రేగుతున్న ధూళితో నగరవాసులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీని నిరోధానికి కఠిన నిబంధనలను అమలు చేసే లా చూడాలని గ్రేటర్ కోర్ కమిటీ సభ్యుడు టీవీ నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం ఏర్పాటు చేసినసమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాల ఉత్తర్వులు, జాతీయ హరిత ట్రిబ్యునల్ 2018 సంవత్సరంలో ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్న అంశాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏకే సుబ్బారావు, సోహన్ హతంగడి, ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారవేదిక' రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై జీవీఎంసీ కార్యాలయంతోపాటు నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికను సెప్టెంబర్ 6వ తేదీ వరకు రద్దుచేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, సీపీ శంఖబ్రతబాగ్చి ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'సెంట్రల్ ఫార్మసీ'పై లైంగిక వేధింపుల కేసు

మహారాణిపేట, ఆగస్టు 4: కలెక్టరేట్ జంక్షన్ వద్దనున్న సెంట్రల్ ఫార్మసీలో లైంగిక వేధింపుల ఆరోపణలపై సంబంధిత యాజమాన్యంపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేయటంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెంట్రల్ ఫార్మసీలో కొంతకాలంగా తమపై జరుగుతున్న అరాచకాలపై ఉద్యోగులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేశారు. వీటికి యాజమాన్యంనుంచి సరైన సమాధానం ఇవ్వకపోవటంతో తాత్కాలికంగా పార్మసీని మూసివేశారు.ఈ క్రమంలో ఈ యాజమాన్యానికి చెందిన డైరెక్టర్ గౌతమ్ అనేవ్యక్తి తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు పార్మసీలో ఉద్యోగం చేసిన దళితురాలైన ఓ యువతి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు అధికారులు ఆ యువతి నుంచి రికార్డెడ్ వాంగ్మూలం నమోదు చేశారు. ఈ ఘటనపై విచారించి కేసు నమోదు చేశారు. అయితే, ఈ కేసులో పోలీసులు నిందితుడు పేరు లేకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేయటం గమనార్హం. ప్రస్తుతం పార్మసీ యాజమాన్య డైరెక్టర్లు అందు బాటులో లేకుండా పరారీలో ఉన్నట్టు సమాచారం. అలాగే, సెంట్రల్ ఫార్మసీలో ఉద్యోగం చేస్తున్న వారు అక్కడే ఉండేలా హస్టల్ ఏ ర్పా టు చేశారు. అయితే, డైరెక్టర్ గౌతమ్ కూడా రాత్రి వేళలో అక్కడే ఉం డటం, అందుకు అవసరమైన గది, మంచం తదితర వాటిని ఏ ర్పాటుచేసుకున్నారు. ఈ క్రమంలోనే తనపై ఓ అర్ధరాత్రి అకౌంట్స్ చూసే నెపంతో అతను లైంగిక వేధింపులకు పాల్పడినట్టు బాధిత యువతి పేర్కొన్నారు. దీనిపై పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో భయం... భయం

... 5వ పేజీ తరువాయి



సంఘటనా స్థలానికి చేరుకుంటున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పరుగులు తీయడంతో స్టేషన్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగ కమ్మేస్తుండడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. అగ్నిప్రమాదం జరగడంతో పరుగులు తీశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

బీ-7 కోచ్‌లో లోపంపై సమాచారముందా?

అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌లో సాంకేతిక లోపం ఉందని అధికారులకు ముందస్తు సమాచారముందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ కోచ్‌లో గ్యాస్ సమస్య ఏర్పడి, ఏసీ సరిగా పనిచేయడం లేదని, విశాఖ చేరిన వెంటనే మరమ్మతులకు తరలించాలని అధికారులకు సిబ్బంది ముందస్తు సమాచారమిచ్చారని, దీంతో రైలు విశాఖకు చేరిన వెంటనే బీ-7, బీ-6 కోచ్‌లను సిక్ లైనుకు తరలించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అయితే స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి కోచ్‌లను గంటల తరబడి ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేయడంతోనే ప్రమాదం సంభవించిందని చెబుతున్నారు. ర్యాక్‌కు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం జరగదని, నిర్వహణ కోసం కోచింగ్ కాంప్లెక్సుకు తరలించే సమయంలో సిక్ కోచ్‌లుగా గుర్తించిన (బీ-7, బీ-6) తొలగించవచ్చుననే ధీమాయే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. అధికారులు ఈ అంశాన్ని సమీక్షించి ఏసీ టెక్నీషియన్‌ను ప్రాథమికంగా విచారించారని సమాచారం.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

నాల్గో నంబరు ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లలో జరిగిన అగ్ని ప్రమాదం ప్రభావం రైళ్ల రాకపోకలు పడలేదు. అగ్నిమాపక దళం మంటలను అదుపుచేసిన తర్వాత ర్యాక్‌ను నిర్వహణ నిమిత్తం కోచింగ్ కాంప్లెక్సుకు, దగ్ధమైన కోచ్‌లను యార్డుకు తరలించారు. కోర్బా ఎక్స్‌ప్రెస్ ర్యాక్‌ను విశాఖ నుంచి వయా తిరుపతి మీదుగా కడప వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు (17488) వినియోగించాల్సిన నేపథ్యంలో నిర్వహణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతోపాటు దగ్ధమైన ఏసీ కోచ్‌ల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ కోచ్‌లలో ముందస్తు రిజర్వేషన్ పొందిన ప్రయాణికులు ఖరారైన బెర్తులలో ప్రయాణించారు. ఈ రైలు ఆదివారం నిర్ణీత సమయానికే విశాఖ నుంచి బయలుదేరింది.

ఎయిడెడ్ ఫ్యాకల్టీపై చర్యలకు మీనమేషాలు

... 5వ పేజీ తరువాయి

ఎకనామిక్స్, హిస్టరీ, ఫిలాసఫీ, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ వోడీలుగా ఎయిడెడ్ అధ్యాపకులే కొనసాగుతున్నారు.

వీసీ లేఖ రాస్తారా..?

ఈ ఏడాది నవంబరు వరకు వర్సిటీలో ఎయిడెడ్ అధ్యాప కులు కొనసాగే అవకాశముంది. అప్పటివరకు పనిచేసేలా గత వీసీ ఉత్తర్వులిచ్చారు. ఆ తరువాత కొనసాగించాలా..? వద్దా..? అనేది నిర్ణయించాల్సి ఉంటుంది. ఇటీవల ఇన్‌చార్జి వీసీని కలిసిన ఏయూ ఉద్యోగులకు ఆయన ఈ మేరకు హా మీ కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. ఎయిడెడ్ ఫ్యాకల్టీ విష యాన్ని ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పినట్టు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై లేఖ రాశారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. కాగా ఎయిడెడ్ ఫ్యాకల్టీకి పొడిగింపు ఉత్తర్వులు ఇస్తే సహించేది లేదని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

స్మోక్ సెన్సార్లు పనిచేస్తున్నాయా?

... 5వ పేజీ తరువాయి

వ్యాపించాయి. సాధారణంగా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. వారితో పాటు ప్లాట్‌ఫారాలపై వ్యాపారాలు చేసుకునే వారు తిరుగుతూ ఉంటారు. అయితే ఎవరూ పొగలు రావడాన్ని గమనించలేదు. మంటలు కూడా వ్యాపించాకే అంతా అప్రమత్తమయ్యారు. ఇటీవల రైల్వే శాఖ కొన్ని మార్పులు చేసింది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అన్నింటిలో స్మోక్ సెన్సార్లు ఏర్పాటు చేసింది. కోచ్‌లో ఎక్కడ పొగ వచ్చినా వెంటనే అలారం మోగుతుంది. ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగితే రైలు ఆగిపోతుంది. ఆ తరువాత సహాయక చర్యలు మొదలవుతాయి. అదే వందేభారత్ రైళ్లు అయితే ఏ కోచ్‌లో పొగ వచ్చినా దానిని సెన్సార్లు పసిగట్టిన వెంటనే ఆటోమేటిక్‌గా బ్రేకులు అప్లయ్ అవుతాయి. పైలట్‌కి కూడా అలెర్ట్ వెళుతుంది.

అయితే ప్రమాదానికి గురైన బీఎస్-7 కోచ్‌లో కూడా స్మోక్ సెన్సార్లున్నాయి. అవి ఎందుకు పనిచేయలేదు. అలారం ఎందుకు మోగించలేదు అనే అనుమానాలు రేగుతున్నాయి. ఇంజిన్ నుంచి విడదీసిన కోచ్‌లు కావడంతో వాటికి విద్యుత్ సరఫరా లేదని, అందుకే అలారం మోగలేదని రైల్వే అధికారులు చెబుతున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు బీ-7 కోచ్‌లోని బాత్రూమ్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీనిని రైల్వే అధికారులు అంగీకరించడం లేదు. తాము విచారణ చేశాకే కారణాలు వెల్లడిస్తామంటున్నారు. ప్రతి కోచ్‌లో బ్యాటరీలు కూడా ఉంటాయని, వాటి వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండవచ్చునని అంటున్నారు. అలాగైతే సెన్సార్లు కూడా పనిచేయాలి కదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఈ ఘటన రైల్వే అధికారులకు కొత్త సవాల్ విసిరింది. నిలిపి ఉంచిన కోచ్‌లో స్టేషన్‌లోనే అగ్నిప్రమాదం జరగడం, స్మోక్ సెన్సార్లు ఉన్నా అప్రమత్తం చేయకపోవడం లోపాలుగా కనిపిస్తున్నాయి.

నేడు విచారణ

ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై విచారణ కమిటీని వేశారు. క్లూస్ టీమ్, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ అధికారులు, రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ అధికారులు విశాఖపట్నం వస్తున్నారు. వారు పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌ను పరిశీలించి ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై నివేదిక ఇస్తారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ రేపు

... 5వ పేజీ తరువాయి

ఒకరు రాజీనామా చేశారు), 652 మంది ఎంపీటీసీ సభ్యుల్లో వివిధ కారణాలతో 16 ఖాళీలు ఏర్పడగా 636 మంది, జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లలో 97 మంది (ఒకరు పదవికి రాజీనామా చేశారు), నర్సీపట్నం మునిసిపాలిటీలో 28 మంది, ఎలమంచిలి మునిసిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా జీవీఎంసీ పరిధిలో విశాఖ, అనకాపల్లి లోక్‌సభ సభ్యులు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డితోపాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పి.విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, నర్సీపట్నం మునిసిపాలిటీలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, వండుల రవీంద్రబాబు, వేపాడ చిరంజీవిరావు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటింగ్‌కు విశాఖపట్నం, భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గత నెల 31వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

'డబుల్ ఇస్మార్ట్'.. డబుల్ మాస్ ఎంటర్‌టైనర్

- హీరో రామ్ పోతినేని
- ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందడి



ట్రైలర్ లాంచ్ ఈ వెంట్‌లో హీరోహీరోయిన్ రామ్, కావ్యథాపర్, నటులు

సిరిపురం, ఆగస్టు 4: డబుల్ ఇస్మార్ట్.. డబుల్ మాస్ ఎంటర్‌టైనర్ చిత్రమని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆదివారం రాత్రి సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో 'డబుల్ ఇస్మార్ట్ ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత హాయ్.. విశాఖపట్నం అంటూ పలకరించారు. 2018లో దర్శకుడు పూరి జగన్నాథ్‌ను గోవాలో కలిశానని, ఆ సమయంలో ఎలాంటి సినిమా చేద్దామని అనుకున్నప్పుడు ఇస్మార్ట్ శంకర్ రాశారన్నారు. ఇప్పుడు డబుల్ ఇస్మార్ట్‌వేరే లెవల్‌లో ఉంటుందన్నారు. అందరం చాలా ఇష్టపడి చేసిన ఈ చిత్రమన్నారు. వైజాగ్ వచ్చిన ప్రతిసారీ ఎంతో ఎనర్జీ తీసుకువెళ్తుంటానన్నారు. కమర్షియల్ సినిమా హిట్ అయితే వచ్చే కిక్ మరి దేంట్లోనూ రాదన్నారు. ఆగస్టు 15న ఈ సినిమాతో కలుద్దామన్నారు. మార్ ముంతా చోడ్ చింతా.. అంటూ థాంక్యూ చెప్పారు. హీరోయిన్ కావ్య థాపర్ మాట్లాడుతూ డబుల్ ఇస్మార్ట్ తనకు చాలా స్పెషల్ ఫిల్మ్ అన్నారు. డబుల్ ఇస్మార్ట్ బ్లాస్ట్ కాబోతోందన్నారు. సినీ నటుడు ఆలీ మాట్లాడుతూ కళాకారులను ప్రేమించే నగరం విశాఖ అన్నారు. థియేటర్లకు పట్టిన తుప్పుని వదలగొట్టే సినిమా ఇది అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినిమా ట్రైలర్ లాంచ్‌కు రాలేకపోతున్నాని, సక్సెస్ సెలబ్రేషన్‌కు విశాఖవస్తానని దర్శకుడు పూరీజగన్నాథ్ వీడియో బైట్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ , ఇతన యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



శాకంబరిగా దర్శనమిచ్చిన వరలక్ష్మీనగర్‌లోని నూకాంబిక

శాకంబరిగా నూకాంబిక

వేపగుంట, ఆగస్టు 4: వేపగుంట సమీపం వరలక్ష్మీ నగర్‌లోని నూకాంబిక ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకృతురాలైన అమ్మవారిని దర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

63వ వార్డులో జనసేన సభ్యత్వ నమోదు

సింధియా, ఆగస్టు 4: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జై ఆంధ్రా కాలనీలో ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన వార్డు అధ్యక్షుడు శివ గోరిపూటి ఆధ్వర్యంలో ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులను స్వీకరించారు. వీటిని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు తెలియజేసి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని శివ పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నానిపిల్లి నానాజీ, దాడి లలిత, ఎల్.ప్రదీప్, దివాకర్,వీరమహిళలు ధనలక్ష్మి, రాజీ, వేణి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు జనసైనికులు అండగా నిలవాలని పార్టీ జిల్లా నాయకుడు గుంటూరు మూర్తి అన్నారు. 68వ వార్డు మిందిలో చేపట్టిన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బి.జయలక్ష్మి, బి.శిరీష, ఎం.రవికాంత్, ఎన్.ఆదిలక్ష్మి, ఎస్.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఎంపీకి వినతి

పెదగంట్యాడ, ఆగస్టు 4: స్టీల్‌ప్లాంటుకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ ఫెర్రోస్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) సంస్థను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం సంస్థ ఉద్యోగులు విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఎఫ్ఎస్ఎన్ఎల్ నుంచి పెట్టుబడుల ఉపసంహరణ అంశం ప్రతిపాదన దశలో ఉందని, అందువల్ల దీనికి ఇప్పుడే దీనికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో సంస్థ ఉద్యోగులు జె.మణికుమార్, అజయ్ సెహ్వాగల్, అగ్రహరి గుప్తా, పి.రాములు, తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయికి నగర సంకీర్తన

అగనంపూడి, ఆగస్టు 4: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పెదమడక సంపత్ వినాయక ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగర సంకీర్తనను ప్రారంభించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో సత్యసాయి భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా, సాయి నామాన్ని జపించారు. ఉక్కునగరం సత్యసాయి భజన మండలి కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ సత్యసాయి 99వ పుట్టు పండుగను పురస్కరించుకొని 99 రోజుల పాటు అధ్యాత్మిక భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు ఎస్ఆర్‌కే. రాజు, మడుగుల నరసింగరావు, విందుల వరలహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, విందుల పైడినాయుడు, టీవీ. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **కల్కి:** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 26, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 62, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 32, కీరదోస 30, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	80
ఫారం ధర	--	100
విత్ స్కిన్	--	170
స్కిన్‌లెస్	--	180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

ఆ మార్గంలో ప్రయాణం.. ప్రమాదం

- భీతిగొల్పుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



పెందుర్తిలో లారీ ఢీకొని ధ్వంసమైన విద్యుత్ స్తంభం

పెందుర్తి, ఆగస్టు 4: పెందుర్తి బీఆర్‌టీఎస్ రహదారిలో తరచూ క్వారీ టిప్పర్లు, లారీలు వంటి భారీ వాహనాలు ప్రమాదాలకు గురవుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పలువురు ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం కారణంగా అధిక లోడుతో గల భారీ వాహనాలను ఈ మార్గంలోకి అనుమతిస్తుండడంతో ప్రజల ప్రాణాల మీదకు వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘిస్తూ ఓవర్ లోడుతో వే బిల్లులు కూడా సక్రమంగా లేని కొన్ని వాహనాలు త్వరగా గమ్య స్థానానికి చేరేందుకు అతి వేగంతో నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బొగ్గు, క్వారీ, ఇతర రవాణా లారీలు కనీస భద్రతా ప్రమాణాలను పాటించకుండా పెందుర్తి నాలుగు రోడ్లపై పరిమితికి మించి వేగంతో ప్రయాణిస్తున్నాయి. అర్ధరాత్రి, వేకువజాము సమయాల్లో లారీలు పదుల సంఖ్యలో భారీ వాహనాలు బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. అధిక లోడ్‌తో గల వాహనాల రాకపోకల వల్ల రోడ్డు కూడా ఛిద్రంగా మారుతుంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ధ్వంసమవుతున్నాయి. ఇటీవల పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, దొగ్గవానిపాలెం, ఎస్సార్‌పురం, పులగాలిపాలెం ప్రాంతాల్లో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. లారీలు ఢీకొనడంతో కొన్నిచెట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, మరికొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. తద్వారా ప్రజా ధనం వృథా అవుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కానరాని తనిఖీలు..

చిన్న చిన్న వాహనాలను తనిఖీ చేసే పోలీసులు భారీ వాహనాల కదిలికలపై కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, వాహన పత్రాలు సక్రమంగా లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధిస్తున్నారు. పలు భారీ వాహనాలు పరిమితికి మించిన అధిక లోడ్‌తో వెళుతున్నా, సరైన పత్రాలు లేకున్నా పోలీసులు మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి భారీ వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్న పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పురాతన యుద్ధకళలు సజీవంగా ఉండాలి

కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు

ముగిసిన జాతీయ స్థాయి కరాటే పోటీలు



ట్రోఫీ, మెడల్స్ సాధించిన క్రీడాకారులతో కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

పెదగంట్యాడ, ఆగస్టు 4: పురాతన యుద్ధ కళలు సజీవంగా ఉండాలని, అందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 65వ వార్డు పరిధి భానోజీతోట అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరాటే, బాక్సింగ్ వంటి క్రీడలకు ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్నాటక, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ప్రథమ స్థానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆంధ్రా షోటోఖాన్, తెలంగాణకు చెందిన డ్రాగన్ షోటోఖాన్ కరాటే డు స్పోర్ట్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు కరణంరెడ్డి నరసింగరావు ట్రోఫీలను అందజేశారు. కార్యాక్రమంలో పోటీల నిర్వాహకులు అమరపిని నాని, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. తొలుత జాతీయ కరాటే క్రీడాకారుడు దివంగత అమరపిని శ్రీనివాసరావు, మార్షల్ ఆర్ట్స్ పితామహులు దివంగత మళ్ల సూర్యారావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీ క్యాడెట్ కోర్సుల్లో ప్రవేశ దరఖాస్తుల కోసం తరలివచ్చిన అభ్యర్థులు



దరఖాస్తుల కోసం క్యూలో ఉన్న అభ్యర్థుల కుటుంబీకులు.. పక్కన ఎలా నింపాలో వివరిస్తున్న విద్యార్థిని

మల్కాపురం, ఆగస్టు 5: సీ క్యాడెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులను పొందేందుకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆదివారం తూర్పు నౌకా దళ ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న స్విమ్మింగ్‌పూల్ వద్దకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంతో ఈ ప్రాంతమంతా కిటకిటలాడింది. దరఖాస్తుల కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీ క్యాడెట్ కోర్సు ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆయా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు సహాయకులుగా సేవలందించారు. దరఖాస్తు పొందేందుకు ఒకరిని మాత్రమే క్యూలో అనుమతించారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతి ఆదివారం ఉదయం ఏడున్నర నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించగలమనే నమ్మకం పెరుగుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఇండియన్ నేవీ, కోస్టుగార్డు, ఎయిర్ ఫోర్స్‌లో చేరేందుకు వీలవుతుందని చెబుతున్నారు. శిక్షణలో భాగంగా స్విమ్మింగ్, రైఫిలింగ్, ట్రెక్కింగ్, బోటింగ్ తదితర అంశాలను నేర్పిస్తారు.



గ్రూప్ ఫొటో దిగిన గాంధీగ్రామ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



నాటి ఉపాధ్యాయులతో అగ్నికుల క్షత్రియ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

గాజువాక, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక కార్యక్రమం ద్వారా కలుసుకుని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఇందులో భాగంగా గాంధీగ్రాం హైస్కూల్‌లో 1970-71లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గాజువాకలోని ఓ హోటల్‌లో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, పిల్లల చదువులు, పెళ్లిళ్ల బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మాటూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా పీబీఆర్ ఆనంద్, బి.సంజీవరావు, తులసీరావు, రామకృష్ణ, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి అగ్నికుల క్షత్రియ పాఠశాలలో ఏడో తరగతి చదివిన 1995-96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్కూల్ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడంతో పాటు వారి ఆశీసులు తీసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు.

గోపాలపట్నం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 1983-84, 1987-88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడపారు. పాఠశాల అభివృద్ధిలో తమవంతు సహాయ సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు.



గణబాబుకు సమస్యలు వివరిస్తున్న పూర్వ విద్యార్థులు

స్కూల్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కూల్‌లో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని గణబాబు హామీ ఇచ్చారు.

దుకాణంలో రూ.60 వేలు చోరీ

గాజువాక, ఆగస్టు 4: కణితి రోడ్డులోని ఓ అల్యూమినియం దుకాణంలో ఆదివారం చోరీ జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కణితి రోడ్డులో గోపీకృష్ణ అనే వ్యక్తి అల్యూమినియం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం దుకాణానికి తాళం వేసి అక్కడే ఉన్న విద్యుత్ మీటరుపై పెట్టారు. సాయంత్రం వచ్చి చూసేసరికి షాపు తెరిచి ఉండడం, క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.60 వేలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఉదయం ఓ వ్యక్తి షాపు వద్దకు వచ్చి పని కావాలని అడిగాడని, ఆ వ్యక్తే చోరీకి పాల్పడి ఉంటాడని గోపీకృష్ణ అనుమానం వ్యక్తం చేశారు.

సంపత్ వినాయక ఆలయంలో హోమం

కూర్మన్నపాలెం, ఆగస్టు 4: ఇక్కడి సంపత్ వినాయక ఆలయ ప్రాంగణంలోని ప్రత్యంగిణి అమ్మవారి సన్నిధిలో ఆదివారం ఆషాఢ అమావాస్య సందర్భంగా అర్చకులు శివాజీశర్మ పర్యవేక్షణలో నరఘోష నివారణార్థం, లోకకల్యాణం కోసం ప్రత్యంగిరా సహిత సర్వ దేవతా హోమం జరిపారు. తొలుత నవగ్రహాలకు తైలాభిషేకాలు, కాలభైరవునికి పూజలు చేశారు.

ప్రధానోపాధ్యాయులకు ఎఫ్‌ఏసీలుగా అవకాశం కల్పించాలి

ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 4: సర్వీస్ రూల్స్‌తేలేవరకు పంచాయతీరాజ్, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు కామన్ సీనియారిటీని పరిగణలోకి తీసుకుని ఉప విద్యాశాఖ అధికారులుగా తాత్కాలిక పదోన్నతులు లేదా ఎఫ్‌ఏసీలుగా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణ, వెలమల శ్రీనివాసరావు కోరారు. డాబాగార్డెన్స్‌లో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వ అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతి వరకు తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలన్నారు. 2024-25విద్యా సంవత్సరంలో నిర్వహించే 10వ తరగతి పరీక్షలను తెలుగు మీడియంలో కూడా నిర్వహించాలన్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులను గ్రేడ్-1గా పెంచి పదోన్నతులు కల్పించాలని, తదితర 11 డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



సాగరతీరంలో యువతుల కేరింత

నగరవాసులు స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఈ వేడుకలను చేసుకున్నారు. నగర పరిధిలోని పలు హోటళ్లు, పాఠశాలల్లో పలువురు సెలబ్రేట్ చేసుకోగా, బీచ్ రోడ్డులో కళాశాలల యువతీ, యువకులు సంబరాలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ జేసుకోవడంతో పాటు ఫ్రెండ్ షిప్ బాండ్స్ కట్టి, కేక్ కట్ చేసి, సందడి చేశారు. -ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం



ముద్దు ముద్దుగా స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకుంటూ..

'ఉక్కు'ను విక్రయించాలని చూస్తే ఊరుకోం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

కూర్మన్నపాలెం, ఆగస్టు 4: స్టీల్‌ప్లాంటును విక్రయించాలని చూస్తే ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,270వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తే సహించబోమన్నారు. మూడేళ్లకు పైగా ఉక్కు ఉద్యోగులు దీక్షలు చేస్తున్నా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిచేందుకు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్, ప్రిఫరెన్స్ షేర్స్, లెటర్ ఆఫ్ కంఫర్ట్ వంటి ప్రతిపాదనలను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు స్థితిగతులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సారథ్యంలో సీఎం చంద్రబాబుకు వివరించామన్నారు. ఉక్కు పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ గుమ్మడి నరేంద్ర, మన్మథరావు, అచ్యుతరావు, కొండలరావు, సత్యనారాయణ, రెహనాన్, మసేనురావు, తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 4: మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు అన్నారు. స్టీల్‌ప్లాంట్ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏఎంటీజెడ్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే పరమావధిగా సత్యసాయి సమితి ముందుకు సాగుతుందన్నారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి ప్లాంట్ కన్వీనర్ జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'వనితా వాకర్స్' ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు

అగనంపూడి, ఆగస్టు 4: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నడక మైదానం వద్ద మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఎంఈవో ఎం.సునీత ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలు నడక, పరుగు పందెం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వనితా క్లబ్ ప్రతినిధులు ఇందిరాదేవి, శశికళ, చిన్ని పూర్ణ, విజయలక్ష్మి, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు నరసింగరావు, సత్యనారాయణ, పైడిరాజు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతకు ప్రతినెలా సమావేశాలు

వేపగుంట ఆగస్టు 4: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని సింహపురికాలనీ దరి వాసుదేవ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పెందుర్తి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెందుర్తి సంఘం అధ్యక్షుడు చందక చలపతి మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో 130మంది కుటుంబాలకు చెందిన సభ్యులు, సంఘ కార్యదర్శి కె. ఎర్నిబాబు, పీతల విష్ణు, కనకరాజు, ఎర్నిబాబు, చందు, శ్రీను, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు తోడ్పాటు



మాట్లాడుతున్న రామకోటయ్య

సీతమ్మధార, ఆగస్టు 4: బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు సహకారం అందజేయడమే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మిణ్ పని చేస్తోందని సంస్థ గౌరవాధ్యక్షుడు చెరువు రామకోటయ్య తెలిపారు. ఆదివారం శంకరమఠంలో బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిజాయితీ, నిబద్ధతతో వ్యాపారం చేసి అందరి మన్ననలు పొందాలని బ్రాహ్మణ యువతకు సూచించారు. వ్యాపారం ప్రారంభించాలనే బ్రాహ్మణ ఔత్సాహికులకు తాము అన్ని విధాలా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. వ్యాపార అభివృద్ధి, అవసరమైన మౌలిక వసతులు, ఆర్థిక వనరులు తదితర అంశాల్లో సభ్యులకు సమగ్ర అవగాహన కల్పించి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్ ధవల మధుసూదనరావు, సెక్రటరీ పరిమి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు



మనమడికి పైడమ్మను అప్పగిస్తున్న వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి

అక్కయ్యపాలెం, ఆగస్టు 4: తప్పిపోయిన ఓ వృద్ధురాలిని తిరిగి ఆమె ఇంటికి అసోసియేషన్ ఆఫ్ అర్బన్, ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఏయూటీడీ) చేర్చింది. పైడమ్మ (66) వృద్ధురాలు రెండు రోజుల క్రితం తన పెద్ద కుమార్తెతో కలిసి విజయనగరం వెళ్లేందుకు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వచ్చారు. ఇంతలో ఆమె కుమార్తెను వీడి కాంప్లెక్స్‌లో తప్పిపోయినట్టు టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. శనివారం రాత్రి వృద్ధురాలిని గుర్తించిన రెండో పట్టణ పోలీసులు ఆరా తీయగా వివరాలు చెప్పలేకపోయింది. దీంతో టీఎస్సార్ కాంప్లెక్సులో ఉన్న ఏయూటీడీ, జీవీఎంసీ మహిళా షెల్టర్‌కు పోలీసులు తరలించారు. అయితే, ఆమె వద్దనున్న పెన్షన్ స్లిప్ ఆధారంగా మద్దిలపాలెం సహా వివిధ సచివాలయాలకు సమాచారమందించారు. పెన్షన్ ఐడీకి లింకై ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా, పైడమ్మ మనుమడు గౌరినాయుడు మద్దిలపాలెం నుంచి వచ్చి వృద్ధురాలిని తీసుకుని వెళ్లారు. ఏయూటీడీ సేవలను, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయికి ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు పత్రం అందిస్తున్న నాగరాజు

జ్ఞానాపురం, ఆగస్టు 4: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విశాఖ దక్షిణ నియోజకవర్గ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భీమ్‌నగర్, పూతివారి వీధి, సౌత్ జైల్‌రోడ్డు ప్రాంతంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు కూడా సభ్యత్వ నమోదు చేయించుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో కంచి మూర్తి ఈశ్వరరావు, మద్ది రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, రాజు, అప్పలరాజు, నాయకులు కందుల బద్రీనాథ్, కందుల కేదార్‌నాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్యులు, మహిళా సంఘం ప్రతినిధులు

కంచరపాలెం, ఆగస్టు 4 : జీవీఎంసీ 55వార్డు పరిధి ధర్మానగర్, కంచరపాలెం ఏరియాలో శ్రీ దుర్గామహిళా చైతన్య సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్ఆర్ ఆసుపత్రి అధినేత సత్యానంద్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు కె.వి. కృష్ణారావు, బాలశంకర్, మధుబాబు తదితరులు పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 200మంది రోగులకు చికిత్సనందించారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం వ్యవస్థాపకుడు పి.ఆదినారాయణ, మహిళా అధ్యక్షురాలు బి.లత, పి. నాగలక్ష్మి, తిరుమలేష్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మండలాలు సరే.. సిబ్బంది ఏరీ?

- విశాఖపట్నం అర్బన్ విద్యాశాఖలో నాలుగు మండలాలు ఏర్పాటు
- ఒక్కో చోట ఇద్దరు చొప్పున ఎంఈవోలు, సీఆర్‌పీల నియామకం
- సిబ్బందిని నియమించని వైనం... కూర్చునేందుకు నీడ కరవు
- గత ప్రభుత్వ నిర్వాకంతో అవస్థలు

కంచరపాలెం, ఆగస్టు 4: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం అర్బన్ పరిధి విద్యాశాఖలో నాలుగు మండలాలు ఏర్పాటయ్యాయి. ప్రతి మండలానికి ఇద్దరుచొప్పున మండలవిద్యాశాఖాధికారులను నియమించారు. మండలాలైతే ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఎంఈవో కార్యాలయాల్లో సిబ్బందిని మాత్రం నియమించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్తగా ఎంఈవోలుగా వచ్చిన వారు కూర్చోవడానికి నిలువ నీడ కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఆయా మండలాల్లో అనువైన పాఠశాలలను వెతుక్కుంటూ అక్కడే తాత్కాలికంగా తమ కార్యాలయాలుగా ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలను నెట్టుకొస్తున్నారు. విద్యాశాఖలో ప్రతి పని కంప్యూటర్ పైనే చేయాల్సి రావడం, వాటి నిర్వహణకు సిబ్బంది లేక ఎంఈవోలు తలపట్టుకుంటున్నారు. ప్రతి మండల కార్యాలయంలో ఎమ్మార్సీ (మండల వనరుల కేంద్రం)లో ఒక ఎంఐఎస్ కో ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అక్కౌంటెంట్, మెసెంజరు తదితర సిబ్బంది తప్పకుండా ఉండాలి. ఎంఈవోలు ప్రతి నెలా చూపే ఉపాధ్యాయుల జీతాలు బిల్లులు, విద్యా సంబంధిత డేటాను వీరు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే, సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్పీలపైనే ఈ పనిభారం పడుతోంది.

సీతమ్మధారలో ఒకే చోట సిబ్బంది



సీతమ్మధారంలో ఒకే చోట ఉన్న కార్యాలయం

గతంలో విశాఖ అర్బన్ అంతా ఒకే మండలంగా ఉండేది. అప్పుడు ఇక్కడ పనిచేసే ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్, మెసెంజర్ తదితర సిబ్బంది ప్రస్తుతం సీతమ్మధార మండలానికే పరిమితమయ్యారు. మిగిలిన కొత్తగా ఏర్పాటైన మూడు మండల కార్యాలయాలు గోపాలపట్టణం, మహరాణిపేట, ములగాడలలో ఒక్క సిబ్బందినీ నియమించలేదు. ప్రస్తుతం ఈ మండలాల్లో ఇద్దరు చొప్పున ఎంఈవోలు, సీఆర్పీలు మాత్రమే ఉన్నారు. విద్యేతర పనులకు సిబ్బంది లేక, కొంత మంది ఎంఈవోలు తమ సొంత డబ్బుతో పనులు చేయిస్తున్నారు. కనీసం మెసెంజర్ లేకపోవడంతో కార్యాలయాలు ఊడ్చే గత్యంతరం లేకుండా పోతోంది. తలుపులను ఎంఈవోలే తీసి వేయాల్సిన దుస్థితి. ఎంఈవోలు నెలనెలా లక్ష్యం నిర్దేశిస్తారు., కానీ వసతులు సమకూర్చకుంటే ఎలా అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు దృష్టిని సారించి మండల విద్యాశాఖ కార్యాలయంలో అవసరమైన సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

విశాఖ సిటిజన్ ఫోరం సేవలు స్ఫూర్తిదాయకం

- పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు




సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు

డాబాగార్డెన్స్, ఆగస్టు 4: నగర ప్రజలకు విశాఖ సిటిజన్ ఫోరం చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. ఆదివారం రాత్రి సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం డాబాగార్డెన్స్ పాత జైల్ రోడ్డులోని సౌభాగ్య హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గణబాబు మాట్లాడుతూ, సిటిజన్ ఫోరం చేస్తున్న సేవలను భవిష్యత్తులో మరింతగా విస్తృతం చేయాలన్నారు. ప్రత్యేక అతిథి నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ నలుగురికి మంచి చేసే కార్యక్రమాలను చేపడుతుండడం గొప్ప విషయమని కొనియాడారు. విశాఖ సిటిజన్ ఫోరం గౌరవ అధ్యక్షులుగా పి.వెంకటరావు, అధ్యక్షుడిగా పి.ఎస్.తిలక్, ఉపాధ్యక్షులుగా కె.సత్యనారాయణ, సెక్రటరీలుగా పి.రామకృష్ణ, బి.సీతారామయ్య, కోశాధికారులుగా పిరాము, ఎన్.సోమునాయుడు, మరో నలుగురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఫోరం నాయకులు విద్యార్థి వెంకటరావు మాట్లాడుతూ తమ ఫోరం 13 ఏళ్ల నుంచి అనేక సేవా కార్య క్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబును సన్మానించారు.

క్లాక్ టవర్ గంటలు... సరికొత్త సవ్వడి

- జగదాంబ జంక్షన్ వద్ద మోగుతున్న గడియారం

జగదాంబ కూడలి, ఆగస్టు 4: జగదాంబ కూడలిలో క్లాక్ టవర్ నుంచి గంటలు మోగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి క్లాక్ టవర్ ప్రతి గంటకూ గంటలు వినిపిస్తూ నగరవాసుల్లో సరికొత్త అనుభూతికి లోను చేసింది. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ క్లాక్ టవర్ నిర్మాణం చేపట్టారు. ఎంతో అందంగా నాలుగు ముఖాల్లో గడియారాలను ఏర్పాటు చేశారు. గడియారంలో సమయం కనిపించేది. రాత్రి వేళ రంగు రంగుల విద్యుత్ కాంతులతో ఆకర్షణగా నిలుస్తోంది. నిర్మాణ పనులు పూర్తి కావడంతో గడియారం ట్రైల్ రన్‌ను భువనేశ్వర్‌కు చెందిన తాజ్‌వాజ్ అండ్ ఎలక్ట్రానిక్స్ నిర్వహించింది. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో ఆదివారం నుంచి గంటల కొడుతూ ఆ శబ్దం సరికొత్త అనుభూతి నిస్తోంది. వంద అడుగుల ఎత్తులో క్లాక్ టవర్ ఏర్పాటు కాగా, ఇందులో డయల్ 8 అడుగుల విస్తీర్ణం నలువైపులా ఒకేలా ఉండేలా తీర్చిదిద్దారు. గడియారంలో పెద్దముళ్లు నాలుగు అడుగులు, చిన్న ముళ్లు మూడున్నర అడుగుల పొడువునా ఏర్పాటు చేశారు. గడియారం రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించేలా కాంతులతో టవర్ తీర్చిదిద్దారు. ఇప్పుడు ఠంచనుగా గంటలు మోగిస్తూ సమయం తెలుపుతోంది.



సర్వాంగ సుందరంగా క్లాక్ టవర్

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జ్ఞానాపురం, ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1987-88) ఆదివారం మేఘాలయ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రైల్వేకాలనీ, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఉత్తరాంధ్ర, తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి సుమారు వందమంది పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు. తమ పాఠశాలలో బాల్య స్మృతులు నెమరవేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి గతంలో చేపట్టిన కార్యక్రమాలు సమీక్షించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించారు. ఆటపాటలు, నృత్యాలతో హోరెత్తించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లక్కీడిప్‌కు అనూహ్య స్పందన వచ్చింది.



జ్ఞానాపురం హైస్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థులు

ఈ కార్యక్రమంలో బసవ శ్రీనివాస్, చామన విశ్వేశ్వరరావు, ఎం. రవీంద్ర, కె. గౌరీశంకర్, కె.ఈశ్వరి, ఎ.సంజీవి, ఎల్. కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



నక్కవానిపాలెంలో కేక్ కట్ చేస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం

సీతమ్మధార: నక్కవానిపాలెంలో బోర రవికుమార్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, ప్రజలు కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం విహార యాత్ర చేశారు. కోన గోవింద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోర ఆనంద్, బోర వేణురెడ్డి, బోర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రాస్ రూట్స్ ఫుట్‌బాల్ విజేత వెలంపేట ఎఫ్‌సీ



విజేతలకు ప్రశంసా పత్రాలందిస్తున్న అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 4: జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జరిగిన గ్రాస్ రూట్స్ సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో వెలంపేట ఫుట్‌బాల్ క్లబ్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో అన్వర్ బాయ్స్‌పై విజయం సాధించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి పోలీసు అధికారి రవికుమార్, ఏపీఎఫ్ఏ గ్రాస్ రూట్స్ కన్వీనర్ సుస్మిత ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీ, బహుమతులు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ఎస్‌జీ.రామకృష్ణ, ఎస్ఐఎస్ కోచ్ శేషుమోహన్ (బుజ్జి), ఎస్‌కేఎంఎల్ గ్రాండ్ అధినేత పి.శ్రీనివాసరావు, త్రినాధ్ (బాబు), సన్నీ తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు ధూళిని నియంత్రించాలి'

సీతమ్మధార, ఆగస్టు 4: విశాఖ పోర్టు అథారిటీలో బొగ్గు రవాణాతో రేగుతున్న ధూళితో నగరవాసులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీని నిరోధానికి కఠిన నిబంధనలను అమలు చేసే లా చూడాలని గ్రేటర్ కోర్ కమిటీ సభ్యుడు టీవీ నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం ఏర్పాటు చేసినసమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాల ఉత్తర్వులు, జాతీయ హరిత ట్రిబ్యునల్ 2018 సంవత్సరంలో ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్న అంశాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏకే సుబ్బారావు, సోహన్ హతంగడి, ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

'ప్రజా సమస్యల పరిష్కారవేదిక' రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై జీవీఎంసీ కార్యాలయంతోపాటు నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికను సెప్టెంబర్ 6వ తేదీ వరకు రద్దుచేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, సీపీ శంఖబ్రతబాగ్చి ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'డబుల్ ఇస్మార్ట్'.. డబుల్ మాస్ ఎంటర్‌టైనర్

- హీరో రామ్ పోతినేని
- ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందడి

సిరిపురం, ఆగస్టు 4: డబుల్ ఇస్మార్ట్.. డబుల్ మాస్ ఎంటర్‌టైనర్ చిత్రమని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆదివారం రాత్రి సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో 'డబుల్ ఇస్మార్ట్ ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత హాయ్.. విశాఖపట్నం అంటూ పలకరించారు. 2018లో దర్శకుడు పూరి జగన్నాథ్‌ను గోవాలో కలిశానని, ఆ సమయంలో ఎలాంటి సినిమా చేద్దామని అనుకున్నప్పుడు ఇస్మార్ట్ శంకర్ రాశారన్నారు. ఇప్పుడు డబుల్ ఇస్మార్ట్‌వేరే లెవల్‌లో ఉంటుందన్నారు. అందరం చాలా ఇష్టపడి చేసిన ఈ చిత్రమన్నారు. వైజాగ్ వచ్చిన ప్రతిసారీ ఎంతో ఎనర్జీ తీసుకువెళ్తుంటానన్నారు. కమర్షియల్ సినిమా హిట్ అయితే వచ్చే కిక్ మరి దేంట్లోనూ రాదన్నారు. ఆగస్టు 15న ఈ సినిమాతో కలుద్దామన్నారు. మార్ ముంతా చోడ్ చింతా.. అంటూ థాంక్యూ చెప్పారు. హీరోయిన్ కావ్య థాపర్ మాట్లాడుతూ డబుల్ ఇస్మార్ట్ తనకు చాలా స్పెషల్ ఫిల్మ్ అన్నారు. డబుల్ ఇస్మార్ట్ బ్లాస్ట్ కాబోతోందన్నారు. సినీ నటుడు ఆలీ మాట్లాడుతూ కళాకారులను ప్రేమించే నగరం విశాఖ అన్నారు. థియేటర్లకు పట్టిన తుప్పుని వదలగొట్టే సినిమా ఇది అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినిమా ట్రైలర్ లాంచ్‌కు రాలేకపోతున్నాని, సక్సెస్ సెలబ్రేషన్‌కు విశాఖవస్తానని దర్శకుడు పూరీజగన్నాథ్ వీడియో బైట్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ , ఇతన యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



ట్రైలర్ లాంచ్ ఈ వెంట్‌లో హీరోహీరోయిన్ రామ్, కావ్యథాపర్, నటులు

'సెంట్రల్ ఫార్మసీ'పై లైంగిక వేధింపుల కేసు

మహారాణిపేట, ఆగస్టు 4: కలెక్టరేట్ జంక్షన్ వద్దనున్న సెంట్రల్ ఫార్మసీలో లైంగిక వేధింపుల ఆరోపణలపై సంబంధిత యాజమాన్యంపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయటంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెంట్రల్ ఫార్మసీలో కొంతకాలంగా తమపై జరుగుతున్న అరాచకాలపై ఉద్యోగులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేశారు. వీటికి యాజమాన్యంనుంచి సరైన సమాధానం ఇవ్వకపోవటంతో తాత్కాలికంగా ఫార్మసీని మూసివేశారు.ఈ క్రమంలో ఈ యాజమాన్యానికి చెందిన డైరెక్టర్ గౌతమ్ అనేవ్యక్తి తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఫార్మసీలో ఉద్యోగం చేసిన దళితురాలైన ఓ యువతి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు అధికారులు ఆ యువతి నుంచి రికార్డెడ్ వాంగ్మూలం నమోదు చేశారు. ఈ ఘటనపై విచారించి కేసు నమోదు చేశారు. అయితే, ఈ కేసులో పోలీసులు నిందితుడు పేరు లేకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేయటం గమనార్హం. ప్రస్తుతం ఫార్మసీ యాజమాన్య డైరెక్టర్లు అందు బాటులో లేకుండా పరారీలో ఉన్నట్టు సమాచారం. అలాగే, సెంట్రల్ ఫార్మసీలో ఉద్యోగం చేస్తున్న వారు అక్కడే ఉండేలా హాస్టల్ ఏ ర్పా టు చేశారు. అయితే, డైరెక్టర్ గౌతమ్ కూడా రాత్రి వేళలో అక్కడే ఉం డటం, అందుకు అవసరమైన గది, మంచం తదితర వాటిని ఏ ర్పాటుచేసుకున్నారు. ఈ క్రమంలోనే తనపై ఓ అర్ధరాత్రి అకౌంట్స్ చూసే నెపంతో అతను లైంగిక వేధింపులకు పాల్పడినట్టు బాధిత యువతి పేర్కొన్నారు. దీనిపై పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో భయం... భయం

... 5వ పేజీ తరువాయి



సంఘటనా స్థలానికి చేరుకుంటున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పరుగులు తీయడంతో స్టేషన్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగ కమ్మేస్తుండడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. అగ్నిప్రమాదం జరగడంతో పరుగులు తీశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

బీ-7 కోచ్‌లో లోపంపై సమాచారముందా?

అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌లో సాంకేతిక లోపం ఉందని అధికారులకు ముందస్తు సమాచారముందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ కోచ్‌లో గ్యాస్ సమస్య ఏర్పడి, ఏసీ సరిగా పనిచేయడం లేదని, విశాఖ చేరిన వెంటనే మరమ్మతులకు తరలించాలని అధికారులకు సిబ్బంది ముందస్తు సమాచారమిచ్చారని, దీంతో రైలు విశాఖకు చేరిన వెంటనే బీ-7, బీ-6 కోచ్‌లను సిక్ లైనుకు తరలించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అయితే స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి కోచ్‌లను గంటల తరబడి ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేయడంతోనే ప్రమాదం సంభవించిందని చెబుతున్నారు. ర్యాక్‌కు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం జరగదని, నిర్వహణ కోసం కోచింగ్ కాంప్లెక్సుకు తరలించే సమయంలో సిక్ కోచ్‌లుగా గుర్తించిన (బీ-7, బీ-6) తొలగించవచ్చుననే ధీమాయే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. అధికారులు ఈ అంశాన్ని సమీక్షించి ఏసీ టెక్నీషియన్‌ను ప్రాథమికంగా విచారించారని సమాచారం.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

నాల్గో నంబరు ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లలో జరిగిన అగ్ని ప్రమాదం ప్రభావం రైళ్ల రాకపోకలు పడలేదు. అగ్నిమాపక దళం మంటలను అదుపుచేసిన తర్వాత ర్యాక్‌ను నిర్వహణ నిమిత్తం కోచింగ్ కాంప్లెక్సుకు, దగ్ధమైన కోచ్‌లను యార్డుకు తరలించారు. కోర్బా ఎక్స్‌ప్రెస్ ర్యాక్‌ను విశాఖ నుంచి వయా తిరుపతి మీదుగా కడప వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు (17488) వినియోగించాల్సిన నేపథ్యంలో నిర్వహణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతోపాటు దగ్ధమైన ఏసీ కోచ్‌ల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ కోచ్‌లలో ముందస్తు రిజర్వేషన్ పొందిన ప్రయాణికులు ఖరారైన బెర్తులలో ప్రయాణించారు. ఈ రైలు ఆదివారం నిర్ణీత సమయానికే విశాఖ నుంచి బయలుదేరింది.

ఎయిడెడ్ ఫ్యాకల్టీపై చర్యలకు మీనమేషాలు

... 5వ పేజీ తరువాయి

ఎకనామిక్స్, హిస్టరీ, ఫిలాసఫీ, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ వోడీలుగా ఎయిడెడ్ అధ్యాపకులే కొనసాగుతున్నారు.

వీసీ లేఖ రాస్తారా..?

ఈ ఏడాది నవంబరు వరకు వర్సిటీలో ఎయిడెడ్ అధ్యాప కులు కొనసాగే అవకాశముంది. అప్పటివరకు పనిచేసేలా గత వీసీ ఉత్తర్వులిచ్చారు. ఆ తరువాత కొనసాగించాలా..? వద్దా..? అనేది నిర్ణయించాల్సి ఉంటుంది. ఇటీవల ఇన్‌చార్జి వీసీని కలిసిన ఏయూ ఉద్యోగులకు ఆయన ఈ మేరకు హా మీ కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. ఎయిడెడ్ ఫ్యాకల్టీ విష యాన్ని ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పినట్టు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై లేఖ రాశారా లేదా అనే దానిపై స్పష్టత లేదు. కాగా ఎయిడెడ్ ఫ్యాకల్టీకి పొడిగింపు ఉత్తర్వులు ఇస్తే సహించేది లేదని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

స్మోక్ సెన్సార్లు పనిచేస్తున్నాయా?

... 5వ పేజీ తరువాయి

వ్యాపించాయి. సాధారణంగా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. వారితో పాటు ప్లాట్‌ఫారాలపై వ్యాపారాలు చేసుకునే వారు తిరుగుతూ ఉంటారు. అయితే ఎవరూ పొగలు రావడాన్ని గమనించలేదు. మంటలు కూడా వ్యాపించాకే అంతా అప్రమత్తమయ్యారు. ఇటీవల రైల్వే శాఖ కొన్ని మార్పులు చేసింది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అన్నింటిలో స్మోక్ సెన్సార్లు ఏర్పాటు చేసింది. కోచ్‌లో ఎక్కడ పొగ వచ్చినా వెంటనే అలారం మోగుతుంది. ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగితే రైలు ఆగిపోతుంది. ఆ తరువాత సహాయక చర్యలు మొదలవుతాయి. అదే వందేభారత్ రైళ్లు అయితే ఏ కోచ్‌లో పొగ వచ్చినా దానిని సెన్సార్లు పసిగట్టిన వెంటనే ఆటోమేటిక్‌గా బ్రేకులు అప్లయ్ అవుతాయి. పైలట్‌కి కూడా అలెర్ట్ వెళుతుంది.

అయితే ప్రమాదానికి గురైన బీఎస్-7 కోచ్‌లో కూడా స్మోక్ సెన్సార్లున్నాయి. అవి ఎందుకు పనిచేయలేదు. అలారం ఎందుకు మోగించలేదు అనే అనుమానాలు రేగుతున్నాయి. ఇంజిన్ నుంచి విడదీసిన కోచ్‌లు కావడంతో వాటికి విద్యుత్ సరఫరా లేదని, అందుకే అలారం మోగలేదని రైల్వే అధికారులు చెబుతున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు బీ-7 కోచ్‌లోని బాత్రూమ్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీనిని రైల్వే అధికారులు అంగీకరించడం లేదు. తాము విచారణ చేశాకే కారణాలు వెల్లడిస్తామంటున్నారు. ప్రతి కోచ్‌లో బ్యాటరీలు కూడా ఉంటాయని, వాటి వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండవచ్చునని అంటున్నారు. అలాగైతే సెన్సార్లు కూడా పనిచేయాలి కదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఈ ఘటన రైల్వే అధికారులకు కొత్త సవాల్ విసిరింది. నిలిపి ఉంచిన కోచ్‌లో స్టేషన్‌లోనే అగ్నిప్రమాదం జరగడం, స్మోక్ సెన్సార్లు ఉన్నా అప్రమత్తం చేయకపోవడం లోపాలుగా కనిపిస్తున్నాయి.

నేడు విచారణ

ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై విచారణ కమిటీని వేశారు. క్లూస్ టీమ్, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ అధికారులు, రీసెర్చి డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ అధికారులు విశాఖపట్నం వస్తున్నారు. వారు పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌ను పరిశీలించి ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై నివేదిక ఇస్తారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ రేపు

... 5వ పేజీ తరువాయి

ఒకరు రాజీనామా చేశారు), 652 మంది ఎంపీటీసీ సభ్యుల్లో వివిధ కారణాలతో 16 ఖాళీలు ఏర్పడగా 636 మంది, జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లలో 97 మంది (ఒకరు పదవికి రాజీనామా చేశారు), నర్సీపట్నం మునిసిపాలిటీలో 28 మంది, ఎలమంచిలి మునిసిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా జీవీఎంసీ పరిధిలో విశాఖ, అనకాపల్లి లోక్‌సభ సభ్యులు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డితోపాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పి.విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, నర్సీపట్నం మునిసిపాలిటీలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, పండుల రవీంద్రబాబు, వేపాడ చిరంజీవిరావు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటింగ్‌కు విశాఖపట్నం, భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గత నెల 31వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఆగస్టు 4 : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

వరి నాట్లకు కూలీల కొరత

పద్మనాభం (రూరల్), ఆగస్టు 4 : మండలవ్యాప్తంగా ఖరీఫ్ పనులు ఒకేసారి ప్రారంభం కావడంతో కూలీల కొరత నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు మద్ది, అనంతవరం, పెంట, గొల్లలపాలెం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, గంధవరం, బాందేవుపురం, తిమ్మపురం, వీకేపాలెం తదిరత గ్రామాల్లో దమ్ములు, వరి నాట్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. కూలి రేట్లు పెంచినా.. ఎవరూ దొరకడం లేదు. రైతులు మహిళా కూలీలకు రోజుకి రూ.400, ఆటో చార్జీలు, మగవారికి రూ.600, మద్యం బాటిల్‌తో పాటు ఆటో చార్జీలు చెల్లిస్తున్నారు. దమ్ము పట్టే ట్రాక్టర్‌కు గంటకు రూ. 1100 ఇస్తున్నారు. అయినా కూలీలు దొరకడం లేదు. అదును దాటితే నాట్లు వేయలేమని రైతులు పక్క గ్రామాల నుంచి కూడా కూలీలను రప్పిస్తున్నారు. దీంతో ఖర్చు గతంలో కంటే ఎక్కువగా పెరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన చిన్నారుల కోలాటం



మధురవాడ, ఆగస్టు 4 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ శిల్పారామంలో ఆదివారం విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన శ్రీలక్ష్మీ నరసింహం బృందం కోలాటం ప్రదర్శించింది. సిద్ధిమా గణపతి, భజరంగ హనుమాన్, పచ్చ పచ్చ నీలవేణి, ఈ వేపచెట్టుకు ఉయ్యాల, అబ్బుబ్బదేవుడు.. అయోధ్య రాముడు, కనక దుర్గమ్మా కదలి రావా, వంటి పలు జానపద గేయాలకు చిన్నారులు చేసిన కోలాటం ప్రేక్షకులను అలరించింది. జి. కరుణ్‌కుమార్ నృత్య దర్శకత్వంలో తష్వ, రుక్షిత, మేఘన, చరిత, గ్రీష్మ, విష్ణుప్రియ, గీతాంజలి, మహాలక్ష్మి, మౌనిక, హరిక, అప్పలనాయుడు తదితరులు కోలాటం ప్రదర్శించారు.

కలగా మూలకుద్దు వంతెన నిర్మాణం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 4 : మూలకుద్దు వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం కలగా మారింది. ఏడేళ్ల నుంచి వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. తగరపువలస వద్ద నదిపై వంతెన ఉంది. మూలకుద్దు వద్ద కూడా నిర్మించినట్లయితే చిప్పాడ, అన్నవరం, అమనాం గ్రామాలకు భీమిలి నుంచి దగ్గర మార్గం అవుతుంది. భోగాపురం వద్ద నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు కూడా భీమిలి నుంచి నేరుగా వెళ్లడానికి అవకాశం కలుగుతుంది. నది అడ్డంగా ఉండడంతో వాహనదారులు తగరపువలస అవంతి కళాశాల మీదగా వెళ్లాల్సి వస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల కిందట వంతెన నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వమైనా వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్

పెదవాల్తేరు, ఆగస్టు 4 : సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజుగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం పెదవాల్తేరులోని ఆ సంఘం కార్యాలయంలో సభ్యులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో నాయుడు, గెద్దాడ రమేష్, బొంతు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో స్వచ్ఛభారత్

సింహాచలం, ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘాట్‌రోడ్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ సభ్యులు ఘాట్ రోడ్డులో భక్తులు పడేసిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఏరి పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవ్ టెంపుల్స్ ప్రతినిధి పిన్నమనేని శ్రీనివాస్, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 26, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 32, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 150, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 44, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 80
ఫారం ధర	-- 100
విత్ స్కిన్	-- 170
స్కిన్‌లెస్	-- 180

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

ఆరేళ్లుగా నిరుపయోగంగా కిచెన్ గార్డెన్ స్థలం

- 2018లో టీడీపీ హయాంలో కేటాయింపు
- నిర్లక్ష్యంగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ఐసీడీఎస్ లక్ష్యానికి తూట్లు



నిరుపయోగంగా పడి ఉన్న కిచెన్ గార్డెన్ స్థలం

పద్మనాభం, ఆగస్టు 4 : పద్మనాభం మండల కార్యాలయాల సముదాయంలో కిచెన్ గార్డెన్ కోసం కేటాయించిన స్థలం ఆరేళ్ల నుంచి నిరుపయోగంగా ఉంది. ఇక్కడ ఆకుకూరలు పండించి అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు, గర్భిణులకు పోషకాహారంగా అందించడానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ స్థలాన్ని మహిళా శిశుసంక్షేమ శాఖకు కేటాయించింది. దీనికి కంచె కూడా ఏర్పాటు చేశారు.కానీ ఇప్పటివరకు ఇక్కడ కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసి ఆకుకూరలు పండించిన పాపాన పోలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దీన్ని పూర్తిగా విడిచిపెట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కూడా తమ కేమీపట్టనట్టు ఈ స్థలాన్ని నిరుపయోగంగా వదిలేశారు. ఎంతో సదాశయంతో కిచెన్ గార్డెన్ కోసం కేటాయించిన స్థలం అలంకారప్రాయంగా పడి ఉంది. జిల్లా పరిషత్ నుంచి కూడా మహిళా సంక్షేమానికి మంజూరు చేసే నిధుల నుంచి గాని, మండల పరిషత్ పాలకవర్గం అయినా తమ బడ్జెట్‌లో మహిళా శిశుసంక్షేమానికి కేటాయించే నిధులతో కిచెన్ గార్డెన్‌లు అభివృద్ధి చేసి, చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పోషక విలువలతో కూడిన కూడిన ఆకు కూరలు అందిస్తే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కిచెన్ గార్డెన్ స్థలాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.



పర్యాటకులతో కిటకిటలాడుతున్న భీమిలి తీరం



సందర్శకులతో సందడిగా ఉన్న రుషికొండ బీచ్

తీరానికి సందర్శకుల తాకిడి

భీమునిపట్నం, ఆగస్టు 4 : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వారాంతపు సెలవు కావడం, స్నేహితుల దినోత్సవం కలిసి రావడంతో నగరంలోని పలు ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి ఎక్కువ మంది పర్యాటకులు తరలివచ్చారు. సాగర తీరాన ఉత్సాహంగా గడిపారు. కొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడగా, మరికొందరు సముద్ర స్నానాలు చేస్తూ సందడి చేశారు.

సాగర్‌నగర్ : రుషికొండ బీచ్ సందర్శకులతో సందడిగా మారింది. వారం రోజులుగా వాతావరణం అనుకూలించక సందర్శకులు తీరానికి రాలేదు. గత రెండు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండడంతో సందర్శకులు బీచ్‌లకు తరలివస్తున్నారు. ఈమేరకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చి సముద్ర స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. సందర్శకులు పెరగడంతో బీచ్ రోడ్డులో వాహనాల రద్దీ పెరిగింది. సాగర్‌నగర్ తీరానికి కూడా సందర్శకులు ఎక్కువగా వచ్చారు.

ఆరిలోవ : నగరంలోని జూపార్కును ఆదివారం 3120 మంది పర్యాటకులు సందర్శించారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 2.81 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.

డిసెంబరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు

భీమునిపట్నం, ఆగస్టు 4 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను డిసెంబరు 13,14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్టు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న జరిగే ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవ వనరుల శాఖా మంత్రి లోకేశ్‌ను ముఖ్య అతిథులుగా ఆహ్వానించనున్నట్టు చెప్పారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు షైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ వేడుకలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు కమిటీలు ఏర్పాటు చేశామని, పాఠశాల వైభవం తెలిసేలా వేడుకలు నిర్వహిస్తామన్నారు. సంఘం కార్యదర్శి షైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ సభ్యుల అభిప్రాయాలను గౌరవిస్తూ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ వేడుకలను విజయవంతం చేస్తామన్నారు. అనంతరం పాఠశాల వేదికపై స్నేహితుల దినోత్సవం కేక్ కట్ చేశారు. శతాబ్ది వేడుకలకు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు రూ. లక్ష, సంఘం సంయుక్త కార్యదర్శి చౌదరి సత్యరాజు రూ. 20 వేలు, ఉపాధ్యక్షుడు ఎంవీ పార్వతీశం రూ.10 వేలు, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి రూ.10 వేలు విరాళాలు ప్రకటించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు ఎంవీ పార్వతీశం, భీమిలి తాలూకా ఎన్జీజీవో సంఘం మాజీ అధ్యక్షుడు కంటుభుక్త ముత్యాలరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ టి.భీమారావు, ముమ్మిడిశెట్టి సత్యానందరావు, మీసాల మహి, చినసూర్యనారాయణ, దాడిశెట్టి రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాడు అప్పలనాయుడు

ఆదివాసీ దినోత్సవానికి బీజేపీ దూరం

పెదవాల్తేరు, ఆగస్టు 4 : ఈనెల 9న జరగనున్న ఆదివాసీ దినోత్సవాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బ్రిటీష్, స్పెయిన్ వివాదంలో ఆ రోజు అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఎంతోమంది అమాయక గిరిజనులు చనిపోయారని, ఆదివాసీ సంస్కృతి, జీవన శైలిని బలవంతంగా నాశనం చేశారని తెలిపారు. ఈ కారణంగా తాము ఆ రోజు జరిగే ఆదివాసీ దినోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఆ రోజును ఆదివాసీ సంతాప దినంగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, బొడ్డేటి రవికుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాజా మురళీ మోహన్ రాజు ఉన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



పాఠశాల ఆవరణలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 4 : స్నేహితులే తోటి వారికి చేయూతనందించేది. కష్ట సుఖాల్లో తోడుగా ఉండేది. ఒకరి బాధ మరొకరితో పంచుకునేది స్నేహితులే. అందుకే పదుల వయసు మీద పడినా జీవితానికి స్నేహమే ఆలంబన అంటూ ఆ వృద్ధ ద్వయం ఒకచోట కలిసింది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాల మైదానంలో వీఎస్‌సీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 40 మంది ఒకేచోట చేరి, ఆత్మీయంగా సంబరాలు చేసుకున్నారు. తమ జీవితాల్లోని ఎత్తుపల్లాలను గుర్తు చేసుకున్నారు.

చేనేత వస్త్ర పరిశ్రమకు ప్రోత్సాహం అవసరం

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 4 : చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సాహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో జరిగిన మెగా ట్రేడ్ ఫెయిర్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత పరిశ్రమను ప్రోత్సహించేందుకు తాను ప్రతి శుక్రవారం చేనేత వస్త్రాలు ధరించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అలాగే పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడు కూడా శుక్రవారం చేనేత వస్త్రాలను ధరిస్తానన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా చేనేత వస్త్రాలను ధరించాలని చెప్పారు. అలాగే పోడు పద్ధతిలో గిరిజనులు పండించే చిరుధాన్యాలను కూడా వినియోగించి, వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



సింహాచలం, ఆగస్టు 4 : గత ఐదేళ్లుగా తిరోగమన దిశలో పయనించిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉందని, అందుకు తగిన శక్తియుక్తులు ఆయనకు ప్రసాదించాలని సింహాచలం వరాహనరసింహుని ప్రార్థించానని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డా.జాస్తి ఆంజనేయులు అన్నారు. సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అప్పన్నకు చంద్రబాబు పేరున పూజలు చేయించామన్నారు. గత వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని పూర్తిగా నాశనం చేశారని, కానీ చంద్రబాబు అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ఆయన కృషికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

భైరవస్వామి ఆలయానికి రోడ్డు నిర్మించాలి

సింహాచలం, ఆగస్టు 4 : భైరవస్వామి ఆలయానికి వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేయడానికి అటవీ శాఖ సహకరించాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర టోలీ సభ్యుడు పూడిపెద్ది శర్మ కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడు దల చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా ఆలయానికి భక్తులు అటవీ మార్గంలో చేరుకుంటున్నారని, గత పాలకుల నిర్వాకం వల్ల ఆలయ ముఖ ద్వారం వద్ద అటవీ శాఖాధికారులు పెద్ద గేటు పెట్టి, తాళాలు వేసి భక్తులను ఇబ్బం దులకు గురిచేశారని ఆరోపించారు. అప్పటి నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుంటున్నారని చెప్పారు. పాలకులు, అధికారులు అటవీ శాఖ మంత్రితో చర్చించి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, ఇతర వసతులు కల్పించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం





ఆర్‌కే బీచ్‌లో యువతుల ఉత్సాహం

నగరవాసులు స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరిపారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఈ వేడుకలను చేసుకున్నారు. నగర పరిధిలోని పలు హోటళ్లు, పాఠశాలల్లో పలువురు సెలబ్రేట్ చేసుకోగా, బీచ్ రోడ్డులో కళాశాలల యువతీ, యువకులు సంబరాలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ జేసుకోవడంతో పాటు ఫ్రెండ్ షిప్ బాండ్స్ కట్టి, కేక్ కట్ చేసి, సందడి చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

'బీసీల సమస్యలు పరిష్కరించాలి'



చంద్రబాబుతో జోగ ముత్యాలు

ఆనందపురం, ఆగస్టు 4 : భీమిలి నియోజకవర్గంలో బీసీల సమస్యలను టీడీపీ జిల్లా కార్యదర్శి జోగ ముత్యాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రిని మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా వైసీపీ హయాంలో బీసీలపై జరిగిన దాడులను వివరించారు. అలాగే బీసీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని, గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ముత్యాలు పేర్కొన్నారు.

ఇళ్ల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



గంటాకు ఇళ్ల సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

ఆనందపురం, ఆగస్టు 4 : వేములవలస పంచాయతీలో కాలనీ ఇళ్ల సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. ఆదివారం వారు ఎంవీపీ కాలనీలో గంటాను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో మండలంలోని అన్ని పంచాయతీలకు కాలనీ ఇళ్లు మంజూరు కాగా, వేములవలసలో కోర్టు సమస్య వల్ల కేటాయించలేదన్నారు. ఎన్నికల ముందు వైసీపీ నాయకులు అనర్హులు, స్థానికేతరులకు హడావిడిగా ఇళ్లు మంజూరు చేసి అక్రమాలకు పాల్పడినట్టు వివరించారు. గ్రామంలో 370 మంది అర్హులుండగా 89 మందికి మాత్రమే పట్టాలు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అట్టాడ బంగారునాయుడు, వార్డు సభ్యులు కోరాడ దాము, బోధ రాజు, కార్యకర్తలు మాదాసు శ్రీరామ్, కోరాడ శ్రీనివాస్, మాదాసు వెంకటేశ్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



మాడవీధుల్లో పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

సింహాచలం, ఆగస్టు 4 : ఆషాఢ మాస బహుళపక్ష అమావాస్య పురస్కరించుకుని సింహగిరిపై వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవిలతో కలిపి స్వర్ణాభరణాలతో, పలు రకాల పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనలు, భక్తుల గోవింద నామస్మరణలు వెంట రాగా మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం సాగింది. మార్గం పొడవునా ఆలయ పండితులు పారాయణలు చేయగా భక్తులు పండ్లు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు.

అలరించిన రామావన్ నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో విదేశీయులు

సిరిపురం, ఆగస్టు 4 :పాండురంగాపురంలోని కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రామావన్ సంగీత శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు. భారతీయ ఇతిహాస గాథలు నుంచి ప్రేరణ పొంది, వాటి ఇతివృత్తంతో సంగీత సాహిత్య ప్రదర్శనలను కళాకారులు అద్భుతమైన రీతిలో ప్రదర్శించారు. రామాయణ కథాంశాన్ని అందంగా, వైవిధ్యంగా, సందేశాత్మకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూరతి వ్యవస్థాపకుడు రిమ్లీ రాయ్ మాట్లాడుతూ దేశంలో రామావన్ సంగీత ప్రదర్శన నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

హెచ్‌ఎంలకు ఎఫ్‌ఏసీలుగా అవకాశం కల్పించాలి

డాబాగార్డెన్స్, ఆగస్టు 4 : సర్వీస్ రూల్స్ తేలేవరకు పంచాయతీరాజ్, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు కామన్ సీనియారిటీని పరిగణలోకి తీసుకుని ఉప విద్యాశాఖ అధికారులుగా తాత్కాలిక పదోన్నతులు లేదా ఎఫ్‌ఏసీలుగా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణ, వెలమల శ్రీనివాసరావు కోరారు. డాబాగార్డెన్స్‌లో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతి వరకు తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే 10వ తరగతి పరీక్షలను తెలుగు మీడియంలో కూడా నిర్వహించాలన్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులను గ్రేడ్-1గా పెంచి పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.